ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 8 మార్చి 2024

గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 35.0°C | కనిష్ఠం : 23.0°C

పెరిగిన పత్తి ధర

ఏనుమాముల మార్కెట్‌లో క్వింటాకు రూ.7,290

వరంగల్ సిటీ, మార్చి 7: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. క్వింటాకు రూ.7,290 పలికింది. మార్కెట్‌లో గత వారం రోజులుగా కొద్ది కొద్దిగా ధర పెరుగుతూ గురువారం రూ.7,290లకు చేరింది. కాగా, రైతులు ఇప్పటికే 80 శాతం పత్తి అమ్మడం జరిగింది. ఇప్పటికే చాలా చోట్ల పత్తి పంటను తొలగించారు. కొంతమంది రైతులు ధర పెరిగితే అమ్ముదామని ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. సీజన్ చివరలో పత్తి ధరలు పెరుగుతుండడంతో రైతులు ఆశాభావంతో ఉన్నారు. అలాగే మిర్చి గరిష్ఠ ధరలు ఇలా ఉన్నాయి. తేజ రకానికి క్వింటాకు రూ.20వేలు, వండర్‌హాట్‌కు రూ.19వేలు, యూఎస్341 రూ.18,500, దేశీ రూ.40వేలు, సింగిల్‌పట్టి రూ.38వేలు, తాలు మిర్చికి రూ.8వేల ధర పలికింది.

బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌వో శ్రీనివాస్



కలెక్టర్ ప్రావీణ్యకు పూలమొక్క అందజేస్తున్న శ్రీనివాస్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 7 : జిల్లా రెవెన్యూ అధికారిగా కె.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రావీణ్యను జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. డీఆర్‌వోకు కలెక్టర్ ప్రావీణ్య శుభాకాంక్షలు తెలిపారు.

హరహర మహాదేవ



విద్యుత్‌దీప కాంతుల్లో హనుమకొండ వేయిస్తంభాల గుడి

- ఆలయాలకు శివరాత్రి శోభ
- ప్రత్యేక పూజలు, జాగరణకు సర్వంసిద్ధం
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు
- నేడు మహాశివరాత్రి పర్వం

మహాశివరాత్రి పర్వదినం కోసం ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుత్‌దీపాల అలంకరణలు, చలువ పందిళ్లతో మహాశివరాత్రి శోభను సంతరించుకున్నాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాలు కల్పించారు. ఇక హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, కాజీపేట మడికొండలోని మెట్టుగుట్ట, వరంగల్‌లోని భద్రకాళి ఆలయం, కాశీబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం, వెంకటాపూర్ మండలం రామప్పలోని రామలింగేశ్వర క్షేత్రం, కురవి వీరభద్రుడి సన్నిధి, మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమ తీరంలోని కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానం.. ఇలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగనున్నాయి.

7

ఓరుగల్లు రాణీరుద్రమలు..

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



- సమ్మక్క, సారలమ్మలిచ్చిన స్థైర్యంతో ముందడుగు
- ప్రజాప్రతినిధులు, అధికారులుగా పాలనలో అతివల మార్కు
- పొదుపు సంఘాల్లోనూ, పరిశుభ్రతలోనూ మేటిగా గుర్తింపు

పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు గడ్డ.. రాణీరుద్రమ పోరాట పటిమ.. వన దేవతలు సమ్మక్కసారలమ్మ ఇచ్చిన స్థైర్యంతో.. చాకలి ఐలమ్మ చూపిన బాటలో ముందడుగు వేస్తున్నారు ఉమ్మడిజిల్లా అతివలు. ప్రజాగళమై.. ప్రజలకు బలమై.. రాజకీయాలు, ప్రభుత్వ పాలనతో పాటు పలు రంగాల్లోనూ తమకు తామే సాటిగా నిరూపించుకుంటూ ఓరుగల్లు 'రాణీ రుద్రమ'లుగా గుర్తింపు పొందుతున్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పలు రంగాల్లో సత్తా చాటుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళల గురించి ప్రత్యేక కథనం.

- హనుమకొండ సిటీ

వివరాలు 7లో..

కేంద్ర నిధులతో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం

- హైదరాబాద్ తర్వాత జిల్లాను గొప్పగా నిలుపుతాం
- కాకతీయరాజులు పేరు, ప్రఖ్యాతి, పౌరుషానికి మారుపేరు
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- 'ఖిలా'లో ఫసాడ్ లైట్ల ప్రారంభం



వరంగల్ కోటలో ఫసాడ్ లైట్లను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో సురేఖ, దయాకర్, ప్రకాష్ తదితరులు

ఖిలావరంగల్, మార్చి 7: కేంద్ర ప్రభుత్వ నిధులతో వరంగల్‌ను అభివృద్ధి చేసి హైదరాబాద్ తర్వాత జిల్లాకు గొప్ప పేరు, ప్రఖ్యాతులను తీసుకువస్తానని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఖిలావరంగల్ మధ్యకోటలో ఇండియన్ ఆయిల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన ఫసాడ్ లైట్లను గురువారం రాత్రి ఆయన రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ కోటలో ఫసాడ్ లైట్లను ప్రారంభించడం గర్వకారణమని, కాకతీయ రాజులు 11వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం వరకు సుమారు 300 సంవత్సరాలు ఈ కోట నుంచి పరిపాలన చేశారని, ఆ కాలంలో నిర్మించిన కీర్తి తోరణాలు, అద్భుత కళాఖండాలు, కట్టడాలకు దేశ విదేశాలలో పేరు ప్రఖ్యాతలున్నాయన్నారు. ప్రస్తుతం కోటలో రూ.3 కోట్లతో 363 లైట్లను ఏర్పాటు చేసి కాకతీయుల కళాఖండాలను దేశ విదేశాలలో వరంగల్ జిల్లాకు గుర్తింపు వచ్చేలా చేస్తామన్నారు. కోటలో గతంలో అమృత్, హెరిటేజ్, స్మార్ట్ సిటీ తదితర నిధులతో అభివృద్ధి పనులు చేశామని, అలాగే ములుగు జిల్లాలోని రామప్పకు యునెస్కోలో గుర్తింపు రావడానికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఖిలావరంగల్ కోటలో ఫసాడ్ లైట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాజముద్రికను తీసివేస్తామన్న విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, కేంద్ర పురావస్తు శాఖ అడిషనల్ డైరెక్టర్ జాన్‌విచ్ శర్మ, ఆర్కియాలజీ సూపరింటెండెంట్ స్మిత ఎస్ కుమార్, జిల్లా అధికారి మల్లేశం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కార్పొరేటర్లు బైరబోయిన ఉమదామోదర్ యాదవ్, వేల్పుగొండ సువర్ణ సురేష్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఫసాడ్ లైట్ల వెలుతురులో ఖిలావరంగల్ కోట

అణువణువూ పరిశీలన

- మేడిగడ్డను సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం
- బ్యారేజీపై ఏడు గంటలపాటు అధ్యయనం
- ఏడో బ్లాక్‌లో కుంగిన పియర్స్, పిల్లర్లు పరిశీలన



వివరాలు 8లో..

దెబ్బతిన్న మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ బృందం

రుద్రేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ బండా ప్రకాశ్

హనుమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ లోని చారిత్రక రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాలగుడిలో గురువారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర శాసన మండలి వైస్‌చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. 19 సంవత్సరాల తర్వాత కల్యాణ మండపం పనులు పూర్తయి ఒక అపూర్వఘట్టం ప్రారంభమవుతోందన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే సందర్శకులకు ఇది ఒక అపూర్వ కానుక అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 8600 శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. సీపీ అంబర్ కిశోర్ ఝూ మాట్లాడుతూ.. శివరాత్రిని పురస్కరించుకుని లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భద్రతా పరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అనంతరం వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు ఫణిభూషణ శర్మ, గంగు మణికంఠ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్పొరేటర్ శ్రీమాన్, రుద్రేశ్వర సేవా సమితి సభ్యుడు పులిరజనీకాంత్, తోట పవన్, గండ్రాతి రాజు, కోన శ్రీకర్ పాల్గొన్నారు.

అంతకు ముందు ఉదయం ఉత్తిష్ఠ గణపతి ఆరాధన, రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. యాగమండపంలో ఉత్సవ రుద్రేశ్వర స్వామివారిని ప్రత్యేక వేదికపై అలంకరించి, అంకురారోహణ, నవగ్రహ ఆరాధన, కలశస్థాపన, రుత్వికరణ, యాగశాల ప్రవేశం, గణపతి నవగ్రహ రుద్రహోమ సహిత 18 సప్తశతి అధ్యాయాలతో లోకకల్యాణార్థం మహాచండీయాగం నిర్వహించారు.

కల్యాణ మండపంలో పునఃశ్చరణ పూజలు:

పునరుద్ధరించిన కల్యాణ మండపంలో సప్త పుణ్యావాచనం, వాస్తు పూజ, యంత్ర, తంత్ర పూజ, అష్టదిక్పాలక పూజ, వేదోక్తంగా 21 మంది వేద పండితుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర ప్రకారంగా కల్యాణ మండప పునఃశ్చరణ పూజలు నిర్వహించారు. మహాహారతి అనంతరం భక్తులకు నందీశ్వరుని దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, మండపం పునర్నిర్మాణంలో పాలుపంచుకున్న స్థపతి శివకుమార్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, కేంద్ర పురావస్తు శాఖ అధికారి మల్లేశం పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణ ఉచితంగా చేయాలి

మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 7 : భూముల క్రమబద్ధీకరణ ఉచితంగా చేయాలని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను ఆహ్వానించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. వీరందరికీ న్యాయం జరగాలంటే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్రమబద్ధీకరణ ఉచితంగా చేయాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, 'కుడా' మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డితో పాటు పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హరహర మహాదేవ

ఆలయాలకు శివరాత్రి శోభ

ప్రత్యేక పూజలు, జాగరణకు సర్వంసిద్ధం

హనుమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ప్రత్యేకపూజలు, అభిషేకాలు, జాగరణకోసం ఆలయాలు, శైవక్షేత్రాలు ముస్తాబవగా భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. వరంగల్ లో పంచభూత లింగాలు ప్రతిష్ఠితమై ఉండడం విశేషం కాగా వరంగల్ కోటలో స్వయంభూ శంభులింగేశ్వరాలయంలో పృథ్వీలింగంగా, వరంగల్ మట్టెవాడలోని భోగేశ్వరాలయంలో జలలింగంగా, భద్రకాళి దేవాలయంలోని భద్రేశ్వర స్వామి ఆలయంలో తేజోలింగంగా, హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో వాయులింగంగా, మడికొండలోని మెట్టుగుట్టపైగల శ్రీ మెట్టురామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆకాశలింగంగా శంకరుడి పంచభూతాత్మక పంచముఖలింగ క్షేత్రాలు ప్రసిద్ధిగాంచాయి. శివాలయాలకు వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం యుద్ధ ప్రాతిపదికపై అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ని సుప్రసిద్ధ శైవక్షేత్రాలో కూడా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా రు. శివకల్యాణంతో పాటు లింగోద్భవ కాలంలో విశేషమైన పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ ని నియంత్రించడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు.



భక్తుల కోసం వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

వేయిస్తంభాలగుడిలో..

హనుమకొండలోని రుద్రేశ్వరస్వామివారి వేయిస్తంభాల గుడిలో ఉదయం 3.30 గంటలకు సుప్రభాతం, 4 గంటల నుంచి స్వామివారికి సామూహిక రుద్రాభిషేకాలు, నిత్యవిధి హవనం, సాయంత్రం 6.59 గంటలకు ధనిష్ట నక్షత్రయుక్త సింహలగ్న సుమూహర్తాన శ్రీ రుద్రేశ్వర స్వామి, రుద్రేశ్వరీ దేవి కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామివారికి మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. జాగరణ చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీసు, వరంగల్ మహానగర పాలక సంస్థల సంయుక్తాధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఆలయ ప్రాంగణం అంతా షామియానాలు, మూడు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వరంగల్ భద్రకాళీగుడిలోని భద్రేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ నుంచే మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రి రోజున తేజోలింగం (అగ్నిముఖలింగం) దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పూలు, పండ్లకు భలే గిరాకీ..

మహాశివరాత్రి సందర్భంగా నగరంలో పలు చోట్ల పండ్లు, పూల అమ్మకాలు జోరుగా సాగాయి. కిలో పూలు రూ. 500 నుంచి రూ. 800 వరకు పలకగా.. పండ్లు కూడా కిలో చొప్పున ప్రత్యేక అమ్మకాలు ఏర్పాటు చేశారు. శివరాత్రి స్పెషల్ కందగడ్డ కూడా రూ. 20 నుంచి రూ.50వరకు అమ్మకాలు జరిగాయి.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

వరంగల్ క్రైం, మార్చి 7: శివరాత్రి సందర్భంగా శుక్రవారం ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం అర్ధ రాత్రి నుంచి శనివారం ఉదయం 10గంటలకు వరకు నగరప్రజలు నిబంధనలు పాటించాలని సూచించారు.

● ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు పెద్దమ్మగడ్డ, కేయూసీ క్రాస్, అంబేద్కర్ జంక్షన్ మీదుగా హనుమకొండ బస్టాండ్‌కు చేరుకోవాలి. హనుమకొండ బస్టాండ్ నుంచి ములుగు, కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేద్కర్ జంక్షన్, కేయూసీ క్రాస్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట్, తొర్రూరు, భద్రాచలం వైపు వెళ్లే బస్సులు బాలసముద్రం, అదాలత్, హంటర్‌రోడ్డు మీదుగా వెళ్లాలి. వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండకు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి, రంగసాయిపేట్, నాయుడు పెట్రోల్‌పంప్, ఉర్సుగుట్ట, అదాలత్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి. ములుగు క్రాస్ నుంచి హనుమకొండ వెళ్లే మోటార్ సైకిళ్లు, కార్లు, ఆటోలు కాపువాడ మీదుగా హనుమకొండ బస్టాండ్ వైపు వెళ్లాలి. హనుమకొండ నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు మర్కజీ రోడ్డు, కొత్తూర్ జెండా మీదుగా పెద్దమ్మగడ్డ రోడ్డు నుంచి వెళ్లాలి. వెయ్యి స్తంభాల గుడి వద్ద పార్కింగ్ సదుపాయం లేనందున వాహనాలు అమృత జంక్షన్ నుంచి వెయ్యి స్థంబాల గుడి వరకు, ఇక్కడి నుంచి అలంకార్ జంక్షన్ వరకు వాహనాలు అనుమతించరు.

ఉమ్మడిజిల్లాలో పలు చోట్ల..

హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఉజ్జయిని మహాకాళేశ్వర శివలింగ దర్శనం, 12 అడుగుల మహాశివలింగ దివ్యదర్శనానికి ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు ఝాము వరకు కార్యక్రమాలను నిర్వహిస్తారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీగట్టుమల్లికార్జున స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ములుగు జిల్లా పాలంపేటలోని రామప్ప దేవాలయం, ఆత్మకూరులోని పంచకూట ఆలయం, వరంగల్ ఉర్సు జాగీరులోని ఫణిగల రామప్ప గుడి, ఐనవోలులోని ప్రాచీన మల్లికార్జునస్వామి ఆలయం, వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, కరీమాబాద్‌లోని విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గలోని విశ్వేశ్వరాలయం, జనగామ జిల్లా కుందారం గ్రామంలోని కుందేశ్వరాలయం, మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వా మి ఆలయం, నీరుకుళ్లలోని చెన్నకేశవ ఆలయం, వరంగల్ మట్టెవాడలోని సుప్రసిద్ధ భోగేశ్వరాలయంతో సహా పలు శివాలయాల్లో వేడుకలు జరుగనున్నాయి.

ఓరుగల్లు రాణీ'రుద్రమ'లు..

- సమ్మక్క, సారలమ్మలిచ్చిన స్థైర్యంతో ముందడుగు
- ప్రజాప్రతినిధులు, అధికారులుగా పాలనలో అతివల మార్కు
- పొదుపు సంఘాల్లోనూ, పరిశుభ్రతలోనూ మేటిగా గుర్తింపు

హనుమకొండ సిటీ, మార్చి 7 : పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు గడ్డపై ఆ రాణీరుద్రమ వారసత్వానికి ప్రతీకలుగా ప్రజాపాలనలో సేవకులుగా.. వనదేవతలు సమ్మక్కసారలమ్మ ఇచ్చిన స్థైర్యమే ఆయుధంగా ముందడుగు వేస్తున్నారు ఉమ్మడిజిల్లా అతివలు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజాగళమై.. ప్రజలకు బలమై.. ఇటు పాలనలో.. అటు రాజకీయాల్లో తమకు తామే సాటిగా నిరూపించుకుంటూ ఓరుగల్లు'రాణి'రుద్రమ'లుగా గుర్తింపు పొందుతున్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు, పొదుపుసంఘాలతో పాటు పలు రంగాల్లో సత్తా చాటుతున్న మహిళల గురించి ప్రత్యేక కథనం.

సమ్మక్క, సారలమ్మల ప్రతిరూపాలుగా..

సమ్మక్క-సారలమ్మల ప్రతి రూపాలుగా ఉమ్మడిజిల్లాకు చెందిన పలువురు మహిళలు రాజకీయాల్లోనే కాకుండా వివిధ రంగాల్లో తమదైన పాత్ర పోషించారు. నాడు మాజీ ఎంపీ డాక్టరు కల్పనాదేవి పార్లమెంట్‌కు ప్రాతిని ధ్యం వహించి రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యాన్ని చా టారు. ఆ తరువాత అనేక మంది మహిళలు రాజకీయా ల్లో రాణిస్తూ వచ్చారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన కాంగ్రె స్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ధనసరి సీతక్క, కొండా సురేఖ మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సీతక్క, కొండా సురేఖ ఇద్దరిదీ పోరాట చరిత్రే.





మేడారం జాతర సేవల్లో తొలి మహిళా ఆర్ఎం..

మేడారం జాతరకు రీజినల్ మేనేజర్‌గా ఓ మహిళా సేవలు అందించడం ప్రత్యేకంగా నిలిచింది. వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్లుగా మహిళా అధికారులు వరుసగా ఇద్దరు వచ్చారు. శ్రీదేవి తొలి మహిళా ఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన గుర్తింపు పొంది వెళ్లగా...ఆమె స్థానంలో రీజినల్ మేనేజర్‌గా శ్రీలత రావడం గమనార్హం. మేడారం జాతరకు ఆర్టీసీ సేవలు ప్రధాన లక్ష్యం. ఓ మహిళా ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తుందా లేదా? అన్న సంశయాలకు శ్రీలత ఆమె తన విధులతో చెక్ పెట్టారు

క్లీన్‌సిటీ ఇమేజ్‌లోనూ మహిళా కార్మికుల పాత్ర

వరంగల్ మహానగరానికి గతంలో దేశంలోనే క్లీన్‌సిటీ ఇమేజ్ దక్కింది. దేశ వ్యాప్తంగా జరిగిన క్లీన్‌సిటీ పోటీల్లో వరంగల్ నగరం నెంబర్ వన్‌గా నిలిచింది. ఈ ఘనత సాధనలో వరంగల్ మహానగర పాలక సంస్థ మహిళా పారిశుధ్య కార్మికుల పాత్ర అనిర్వచనీయం. నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా ఉంచడంలో మహిళా కార్మికులు అంకితభావంతో పని చేస్తున్నారు. పోరాటమే కాదు.. పొదుపు పాఠాలు నేర్పడంలోనూ తమకు సాటి లేరు అని నిరూపించారు ఓరుగల్లు మహిళామణులు. ధర్మసాగర్, వేలరు మండలాల నుంచి అనేక మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లు దేశంలోని ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, ఢిల్లీ ఇతరా రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి మహిళా స్వయం సహాయక సంఘాలకు పొదుపు పాఠాలు నేర్పుతున్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా సీఆర్‌పీ మహ్మద్ షాహిద్ కౌసర్ బేగంతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. మన్ కి బాత్‌లో ప్రస్తావించారు. సీఆర్‌పీల సేవలను ప్రశంసించారు. స్వయం సహాయక సంఘాల పొదుపు సేవల్లో వరంగల్ జిల్లా ప్రధాన మంత్రితో కీర్తించబడి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందంటే ఓరుగల్లు మహిళామణుల ఘనకీర్తే.

నాలుగు జడ్పీలు, కార్పొరేషన్ పీఠాలపై వారే..



వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య | హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ | ములుగు జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి | ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి | భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో నాలుగు జిల్లా పరిషత్ పీఠాలను మహిళలే అధిరోహించారు. ఇది రాజకీయ రణరంగంలో ఓరుగల్లు మహిళా చాణక్యతకు నిదర్శనంగా నిలిచింది. మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌గా అంగోతు బిందు, భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, వరంగల్ జడ్పీ చైర్ పర్సన్‌గా గండ్ర జ్యోతి, ములుగు జడ్పీ చైర్ పర్సన్‌గా బడే నాగజ్యోతి పాలనలో రాణిస్తున్నారు. ఎలాంటి అనుభవం లేకున్నా.. రాజకీయ వారసత్వం లేకపోయినా ఓరుగల్లు పోరాటపటిమను పుణికిపుచ్చుకుని.. పాలనలో దూసుకుపోతున్నారు. ఇక వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ ఇద్దరూ మహిళలే. జీడబ్ల్యూఎంసీ చరిత్రలోనే మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఇరువురు మహిళలు ప్రాతినిధ్యం వహించడం ఇదే ప్రథమం.

మూడు జిల్లాలకు పాలనాధికారులు..

వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాలకు మహిళా కలెక్టర్లే పాలనాధికారులుగా ఉన్నారు. హనుమకొండ కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్, వరంగల్ కలెక్టర్‌గా ప్రావీణ్య, ము లుగు కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి సేవలు అందిస్తున్నారు. ఐటీడీఏ పీవోగా చిత్ర మిశ్రా ఉన్నా రు. ఇక వరంగల్, హనుమకొండ అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు)గా అశ్విని తనాజీ వాఖడే, రాధిక గుప్తా వీరంతా జిల్లా పాలనలో తమదైన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో వరంగల్ మహానగర పాలక సంస్థకు మహిళా కమిషనర్లే సేవలు అందించారు. నీతూ ప్రసాద్, స్మిత సబర్వాల్, శృతి ఓఝా, పమేలా సత్పతి, ప్రావీ ణ్య వీరంతా కూడా జీడబ్ల్యూఎంసీ పాలనలో తమదైన మార్కు వేసి కలెక్టర్లుగా పదోన్నతిపై వెళ్లిన వారే. వరంగల్ కలెక్టర్లుగా పని చేసి వెళ్లిన వారిలో శాలినిమిశ్రా, వాకాటి కరుణ, దమయంతి, ఆమ్రపాలి దేశస్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

24 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 7: ఎన్నికల బదిలీల్లో భాగంగా భారీగా ఇన్‌స్పెక్టర్లు స్థాన చలనం చెందారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 24 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ గురువారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
పి.సత్యనారాయణరెడ్డి	కమిషనరేట్	సుబేదారి
ఎస్.వాసుదేవరెడ్డి	సుబేదారి	మల్టీజోన్-1
బి.సంజీవ్	కమలాపూర్	కేయూసీ
వి.చేరాలు	కేయూసీ	కమీషనరేట్
ఇ.హరికృష్ణ	కమీషనరేట్	కమలాపూర్
ఎం.శివకుమార్	వీఆర్	ఇంతేజార్‌గంజ్
ఎల్.పవన్‌కుమార్	ఇంతేజార్‌గంజ్	గీసుగొండ
జి.బాబులాల్	గీసుగొండ	వీఆర్
పులి రమేశ్	టాస్క్‌ఫోర్స్	ఏనుమాముల
పి.కిషన్	ఏనుమాముల	ఎస్‌బీ
వి.క్రాంతికుమార్	ఎస్‌బీ	ఆత్మకూరు
ఆర్.సంతోష్	ఆత్మకూరు	పీసీఆర్ వరంగల్
కె.సూర్యప్రసాద్	వీఆర్	మహిళా ఠాణా-1
కె.శ్రీధర్‌రావు	మహిళా ఠాణా-1	సీసీఆర్‌బీ
ఎస్.వెంకట్రాం	మల్టీజోన్	మహిళా ఠాణా-2
ఎ.సువర్ణ	మహిళా ఠాణా-2	వీఆర్
ఎంఏ.షుకుర్	సీసీఆర్‌బీ	హనుమకొండ (ట్రాఫిక్)
జి.సీతారెడ్డి	హనుమకొండ ట్రాఫిక్	ఎస్‌బీ
పి.నాగబాబు	ఎస్‌బీ	కాజీపేట ట్రాఫిక్
కె.సుజాత	కాజీపేట ట్రాఫిక్	వీఆర్
సార్ల రాజు	మల్టీజోన్-1	టాస్క్‌ఫోర్స్
ఎస్.రవికుమార్	వీఆర్	టాస్క్‌ఫోర్స్
కె.దామోదర్	వీఆర్	మల్టీజోన్-1
జి.వేణు	టాస్క్‌ఫోర్స్	మల్టీజోన్-1

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలి

ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

కాళోజీ జంక్షన్, మార్చి 7: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును మరింత సమయం కోరడాన్ని నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నాయకత్వంలో బ్యాంకు ఎదుట గురువారం ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ పథకం ప్రాథమిక లబ్ధిదారుగా ఉన్న అధికార బీజేపీ ఆర్థిక అవకతవకలను నల్లధనం మూలాన్ని దాచిపెట్టేందుకు ఎస్‌బీఐని వాడుకుంటోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు జాప్యం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఎలక్టోరల్ బాండ్స్ డేటా కోసం గడువు పొడిగించాలని కోరడం పలు అనుమానాలకు దారితీస్తుందని అన్నారు. బీజేపీకి విరాళాలు అందజేసిన దాతల పేర్లు బయట పెట్టకుండా మోసం చేయడంలో ఎస్‌బీఐ బీజేపీతో కుమ్మక్కైందని అన్నారు. ఎస్‌బీఐ డిజిటల్ ఇండియా, కంప్యూటరైజ్డ్ అకౌంట్ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని భావించి సుప్రీంకోర్టు వాటిని నిషేధించిందని, విరాళాలు అందజేసిన దాతల పేర్లను బహిర్గతం చేయాలని రాజకీయ పార్టీలను కోర్టు ఆదేశించిందని అన్నారు. ధర్నా కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తరతరాలుగా మాదిగలకు అన్యాయం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాళోజీ జంక్షన్, మార్చి 7 : తరతరాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని అందుకు కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అధ్యక్షత వహించారు. షెడ్యూల్డ్ కులాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలితాలను మాదిగలకు దక్కకుండా మాలలు ఎగురేసుకుపోతున్నారని ఆయన అన్నారు. మాదిగలందరూ బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గత నవంబరు 11న విశ్వరూప సభకు ఒక కులానికి సంబంధించిన సమావేశానికి ప్రధాని హాజరు కావడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. మాదిగల 30 ఏళ్ల పోరాటానికి మూడు నెలల్లో ముగింపు తేవడానికి సహకరిస్తూ అండగా నిలబడుతూ అక్కున చేర్చుకుంటున్నారని తెలిపారు. ఏ పల్లెలో చూసినా మాదిగలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోనే ఉన్నారని బీజేపీకి ఉనికి లేదన్నది వాస్తవమని పార్టీలకు అతీతంగా మాదిగలంతా బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని మంద కృష్ణ మాదిగ అభ్యర్థించారు. సదస్సులో పాల్గొన్న వారంతా వారి ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు మాదిగలకు జరిగిన అన్యాయాన్ని వివరించాలన్నారు. సదస్సులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు మంద కుమార్ మాదిగ, జన్ను దినేష్ మాదిగ పాల్గొన్నారు.


15 నుంచి ఒంటిపూట బడులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 7 : ఎండల తీవ్రత దృష్ట్యా మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా సంవత్సరం చివరి రోజు వరకు ఏప్రిల్ 23 వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఒంటి పూట బడులను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించిన తర్వాతనే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని పేర్కొన్నారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని, 10వ తరగతి పరీక్షలు ప్రారంభమైన తర్వాత కేంద్రాలున్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వరంగల్ క్రైం, మార్చి 7 : కాంగ్రెస్ మోసాలకు పెట్టింది పేరని, అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్ల పేరిట మరోమోసం చేసేందుకు సిద్ధమైందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక నిర్ణయం అధిష్ఠానానిదేనని, స్థానిక నేతల అభిప్రాయాలు తీసుకుని విజయావకాశాలున్న వారికి టికెట్ ఇస్తారని ఆయన స్పష్టం చేశారు. 'వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మీ కూతురు బరిలో ఉంటుందా?' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించిన కడియం విజయం సాధించే వారికి అవకాశాలు లభిస్తాయంటూ ఆయన సమాధానాన్ని దాటవేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వందరోజుల్లో ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్నారు. ఎన్నికల కోసం ఆదరాబాదరాగా లాంచింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు ఆయన విమర్శించారు. 15వ తేదీలోపు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసి ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌తో ప్రారంభ ప్రక్రియ ఆగుతుందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికే ఇచ్చిన నాలుగు హామీలు నిబంధనల పేరిట ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ ప్రారంభమైందని, ఎన్నికల కోడ్‌తో నియామక పత్రాలు ఇవ్వలేకపోయినట్లు కడియం వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలు ఇస్తూ కాంగ్రెస్ వారు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కలెక్టర్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 7: కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డికి జిల్లా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పూల మొక్కను అందజేశారు. హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం నిట్ గెస్ట్ హౌజ్‌కు చేరుకున్న మంత్రి కిషన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆయనకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అక్కడే పోలీసులు మంత్రికి గౌరవ వందనం సమర్పించారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

పోచమ్మమైదాన్, మార్చి 7 : నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో పని చేస్తున్న ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరికి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా అన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యలయం ఎదుట ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్ వివరాలు తెలియజేయాలని, చట్ట ప్రకారం రావాల్సిన పీఆర్‌సీ, ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఐవో డాక్టర్ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జక్కా రాజాగౌడ్, తోట భిక్షపతి, దుర్గాప్రసాద్, రవీందర్, మోహన్, అనిల్‌కుమార్, అన్వేష్, జన్ను కోర్నేలు, నూర సంపత్‌కుమార్, విక్టోరియా, సుమ పాల్గొన్నారు.

అసలైన నేతలకే పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలి

వరంగల్‌టౌన్, మార్చి 7 : ఎన్నికలకు ముందు నుంచి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులే నిజమైన కాంగ్రెస్ వాదులని టీపీసీసీ సభ్యుడు నల్గొండ రమేష్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ అసంతృప్త వాదులతో కాశిబుగ్గలోని తన నివాసంలో గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పదేళ్ల కాంగ్రెస్ అధికారంలో లేకున్నా అష్టకష్టాలు పడుతూ పార్టీనే నమ్ముకుని పని చేశారని అన్నారు. ఇన్ని ఇబ్బందులు పడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు, ఇక్కడ కొండా సురేఖను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. అధికారంలోకి రాగానే రెక్కలు కట్టుకుని వాలిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తే పార్టీ కోసం అష్టకష్టాలు పడ్డ అసలైన కాంగ్రెస్ నేతల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. అసలైన నేతలకే పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని కొండా దంపతులను కోరుతానని తెలిపారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌డీ మండల అధ్యక్షుడిగా అశోకుడు

ఖిలావరంగల్, మార్చి 7 : మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) ఖిలావరంగల్ మండల అధ్యక్షుడిగా మైదం అశోకుడు ఎన్నికయ్యారు. నగరంలోని ఖమ్మం రోడ్ వద్ద గురువారం ఆ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ అధ్యక్షతన ఖిలావరంగల్ మండల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఎంహెచ్‌డీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జన్ను మహేష్, కార్యదర్శిగా పొలెపాక మహేష్, ఉపాధ్యక్షులుగా పసునూరి శ్రీకాంత్, ఆకులపెల్లి అరుణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా గాదె రాజు, సలహాదారుగా వేల్పుల ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంజర్ల విక్రమ్, సీహెచ్.సుమన్ తదితరులు ఎన్నికయ్యారు.

గీతకార్మికుడికి పరామర్శ

గీసుగొండ, మార్చి 7 : మండలంలోని శాయంపేటహవేలికి చెందిన బత్తిని అశోక్‌గౌడ్ ఇటీవల తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడటంతో పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్‌గౌడ్ గురువారం అతన్ని పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అశోక్‌గౌడ్‌కు ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని కోరారు. అతని వెంట పులి వెంకటేశ్వర్లుగౌడ్, బొమ్మగాని శ్రీనివాస్‌గౌడ్, ప్రణయ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

హైవే కోసం వ్యవసాయ భూములివ్వం

సంగెం, మార్చి 7 : నేషనల్ గ్రీన్ ఫీడ్ కింద హైవే రోడ్డు నిర్మాణానికి వ్యవసాయ భూములు ఇవ్వమని రైతులు తహసీల్దార్‌కు విన్నవించారు. మండలంలోని తిమ్మాపురం, చింతలపల్లి, నర్సాపూర్ గ్రామాల రైతులు గురువారం వినతి పత్రం అందజేశారు. హైవే రోడ్డు నిర్మాణంలో తమ విలువైన వ్యవసాయ భూములు తీసుకోవడం జరుగుతుందని అధికారులు నోటీసులు ఇవ్వడం పట్ల మండి పడ్డారు. నోటీసుల్లో కోల్పోయిన భూమికి ఎంత నష్టపరిహారం చెల్లిస్తారనే విషయం తెలుపలేదన్నారు. ఈ విషయమై కోర్టుకు వెళతామని రైతులు పేర్కొన్నారు. కుమారస్వామి, నర్సయ్య, కట్టమల్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం భూమిని కాపాడాలి



అదనపు కలెక్టర్ సంధ్యారాణికి ఫిర్యాదు చేస్తున్న దేవాలయ కమిటీ ప్రతినిధులు

సంగెం, మార్చి 7 : మండలంలోని మొం డ్రాయి గ్రామంలో గల శివాలయం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని శ్రీరాజరా జేశ్వర స్వామి దేవాల య కమిటీ అదనపు కలెక్టర్ సంధ్యారాణికి గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో 1200 ఏళ్ల నాటి శివా లయాన్ని పునఃనిర్మి ంచడంలో భాగంగా పనులు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. భూకబ్జాదారులు వీరగోని రమేష్, దంపతులతో పాటు తాళ్లపల్లి యశోద దేవాలయ కమిటీ ప్రతినిధులను దూషిస్తున్నట్లు వివరించారు. కబ్జా భూమిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చెవ్వ మొగిలి, ఉపాధ్యక్షుడు కడుదురి సంపత్, పరికి యాకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కక్కెర్ల వీరస్వామి, మడత కేశవులు, ప్రధాన కార్యదర్శి పెండ్లి పురుషోత్తంరెడ్డి, బాలకృష్ణ, రమేష్, కుమారస్వామి, హరీష్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



గీసుగొండలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 7 : మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోక్ హోటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదని నిరూపించుకోవాలన్నారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వరంగల్ రీజినల్ ఆఫీస్ డిప్యూటీ హెడ్ ఎన్.శ్రీనివాస్, రంగయ్య నాయుడు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి బ్యాంకు అన్ని రకాల రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం పర్వతగిరి మండలానికి చెందిన అంతర్జాతీయ పారా గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారిణి జీవంజి దీప్తిని ఘనంగా సన్మానించి యూపీఐ ద్వారా మెమొంటోతో పాటు ప్రైజ్‌మనీ అందించారు. కార్యక్రమంలో ఏజీఎం సర్వీస్, డిస్ట్రిక్ట్ లీడ్ మేనేజర్ హవేలి రాజు, శ్రీధర్, వినోద్, జీవన్, మహిళా ఉద్యోగులు అపరాజిత, జ్యోతి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ అశ్వినికి సత్కారం

కరీమాబాద్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను సత్కరించారు. గురువారం నాయుడు పెట్రోల్ పంపు సమీపంలోని వినయ్ గార్డెన్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి చేతుల మీదుగా అదనపు కలెక్టర్ అశ్వినిని సత్కరించారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మహిళల పాత్ర కీలకం

సంగెం : సామాజిక సేవలో మహిళల పాత్ర కీలకమని టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు అన్నారు. మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో విధులు నిర్వహించే మహిళలను ఘనంగా సత్కరించి సన్మానించారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపి బహుమతులు అందజేశారు. మహిళలు కుటుంబంలో రోజు చేసే సేవలు వెలకట్టలేనివని శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, వీరన్న, ఆర్ఐలు శోభన్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, దయాశీల, అధికారులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

కరీమాబాద్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆత్మీయ ప్రేమలత, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆత్మీయ సెక్టార్ల ఆధ్వర్యంలో వరంగల్ హంటర్ రోడ్‌లోని ఏకశిల వృద్ధాశ్రమంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రాజేశ్వరి వృద్ధులకు అల్పాహారం అందించారు. అదేవిధంగా లయన్ సమ్మయ్య వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎస్‌వీడీజీ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా పాల్గొని వృద్ధులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారికి కావాల్సిన అవసరాలు తీర్చడంలో ఆనందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజేశ్వరి, సెక్రటరీ కేడల అరుణ, విష్ణువర్ధన్, శ్రీకాంత్, గండి సమ్మయ్య, కృష్ణ, భద్రయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

పోచమ్మమైదాన్ : వరంగల్ దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతం సారంగపాణి ఆధ్వర్యంలో పారిశుధ్య మహిళా కార్మికులకు శాలువాలు కప్పి నూతన వస్త్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సోల రవి, కానిగంటి అశోక్, చీర్ల మల్లారెడ్డి, గువ్వల జంపయ్య, శ్రీరాముల యాదగిరి, జూలూరి చిరంజీవి, నూనె వేణుప్రసాద్, చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీకేఎం కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సమాజంలో మహిళలపై జరిగే అకృత్యాలను సాంస్కృతిక నృత్యాలతో తెలిపారు. కార్యక్రమంలో మాభూమి సంధ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, శోభ, అనిల్, జీకే కుమార్, మోహన్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో

గీసుగొండ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళా ఉద్యోగులను, సిబ్బందిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భీమగాని సౌజన్య మాట్లాడుతూ మహిళలు ఏవైనా సమస్యలు ఎదురైతే అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలన్నారు. తాను అనేక ఆటుపోట్లను ఎదుర్కొని సర్పంచ్, ఎంపీపీ, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగినట్లు వివరించారు. మహిళల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడు ముందుంటానని హామీ ఇచ్చారు. అనంతరం అల్లం బాలకిశోర్‌రెడ్డి అందించిన గిఫ్టులను మహిళలకు ఎంపీపీ అందించారు. కేక్ కట్ చేసి స్వీట్లను పంచారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీవో ప్రభాకర్, ఎంపీటీసీలు వీరారావు, భిక్షపతి, కోఆప్షన్ సభ్యుడు రహీంపాషా, ఏపీవో చంద్రకాంత్, షాజహాన్, కార్యదర్శులు, అల్లం మర్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు

ప్రజాతంత్ర మహిళా సంఘం ర్యాలీ



వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద నుంచి ప్రారంభమైన మహిళల ర్యాలీ

గిర్మాజిపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ర్యాలీని నిర్వహించింది. సంఘం జిల్లా అధ్యక్షురాలు నలిగంటి రత్నమాల ఆధ్వర్యంలో మహిళలు వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి హెడ్‌పోస్టాఫీసు సెంటర్ మీదుగా చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ గత పదేళ్లలో మహిళలపై హింస పలు రూపాల్లో పెరిగిందని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న హింస, అణచివేతను నిరోధించడంలో కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, రేషన్ షాపులలో 14 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాలని రత్నమాల డిమాండ్ చేశారు. అలాగే మహిళా చట్టాలను అమలు చేయాలని కోరారు. ఈ ర్యాలీలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాళ్లు బి.వెంకటలక్ష్మి, ఎన్.రేణుక, బి.సంగీత, కీర్తి, కల్పన, మంజుల, జ్యోతి, లక్ష్మి, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం



దత్తక్షేత్రంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు దేవాలయాల్లో గురువారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. జేపీఎన్ రోడ్డులోని శ్రీదుర్గేశ్వర స్వామి ఆలయంలో, గిర్మాజిపేట బొడ్రాయి సమీపంలోని శివాలయంలో, ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఉదయం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాపాక గోపీకృష్ణ శర్మ నేతృత్వంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు వేదపండితులచే కల్యాణ తంతును నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, మంత్రపుష్పం, మహా నైవేద్య నివేదన గావించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, చకిలం ఏకాంబరం, వి.శార్వాణి, విజేందర్‌రెడ్డి, జూలూరి శ్రీనివాస్, వి.శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ : నగరంలోని 21వ డివిజన్ ఎల్బీనగర్ హిందూ ముక్తిస్థల్‌లో గురువారం లోక కల్యాణార్థం శ్రీ లక్ష్మీనారాయణ శివపార్వతుల(వటవృక్ష) కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గజ్జెల రాజ్‌కుమార్ శాస్త్రి, కోడెం ప్రవీణ్‌కుమార్ శాస్త్రి, వంగర భాస్కర్‌ల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణతో జరిపించారు. కార్యక్రమంలో ముక్తిస్థల్ ప్రతినిధులు బూర రాంచందర్, పడాల నర్సింహరావు, శీలం బాబూరావు, గోసిగొండ సుధాకర్, గోరంటాల రాజు, ఉప్పలయ్య, ప్రభాకర్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు చేయాలి

కరీమాబాద్, మార్చి 7: పవిత్ర రంజాన్ మా సం సందర్భంగా నెల రోజుల పాటు ముస్లింలు ఉపవాస దీక్షలు చేపడుతారని, జిల్లా యంత్రాంగం ఫోర్టురోడ్ మజీద్, ఈద్గా, ఖబరస్థాన్‌లలో అధికారికంగా ఏర్పాట్లు చేయాలని ఖిలావరంగల్ ఈద్గా, మజీద్, ఖబరస్థాన్ కేర్ టేకర్ అబ్దుల్ ఖలీక్ తస్వీర్ అన్నారు. గురువారం ఫోర్టురోడ్‌లోని మజీద్‌లో కమిటీ సభ్యులతో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఫోర్టురోడ్ మజీద్, ఈద్గా, ఖబరస్థాన్ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు, వైట్ వాష్ కలరింగ్, లైటింగ్ తదితర పనులను అధికారులు చేయించాలన్నారు. రంజాన్ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ సేవలు అందించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా మైనారిటీ జనాభా అధికంగా ఉన్నప్పటికి మైనారిటీ సంక్షేమ అధికారి లేకపోవడం తమ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతోందని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా యంత్రాంగం త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఎల్బీనగర్‌లో నిర్మాణంలో ఉన్న షాదీఖానా, దేశాయిపేటలో నిర్మిస్తున్న మైనారిటీ బాలికల మోడల్ గురుకులాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు.

అణువణువూ పరిశీలన

● మేడిగడ్డను సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం

భూపాలపల్లి/కాటారం/మహదేపూర్, మార్చి 7 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) గురువారం సందర్శించింది. నీటిపారుదల శాఖ అధికారులు, బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ఎన్‌టీ సిబ్బంది మినహా ఎవరినీ అనుమతించలేదు. సుమారు ఏడుగంటల పాటు బ్యారేజీని అణువణువూ పరిశీలించిన బృందం అనేక కోణాల్లో వివరాలు సేకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో గుండెలాంటి మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు లేఖరా సింది. దీంతో నిపుణుల బృందం గురువారం మేడి గడ్డలో పర్యటించి.. పియర్స్ కుంగిపోవడం, బీటలు వారడం తదితర అంశాలను నిశితంగా పరిశీలించింది. ఏడో బ్లాక్‌లోని ప్రతీ పియర్ వద్ద క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఆ బృందం మొత్తం 19 అంశాలను పరిశీలించి కీలక సమాచా రాన్ని సేకరించిందని తెలుస్తోంది. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీలో న్యూఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ అండ్‌మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ యు.సి. విద్యార్థి, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) డైరెక్టర్ శివకుమార్ శర్మ, డ్యాం గేట్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ రెజిలియన్స్ డైరెక్టర్ రాహుల్ కుమార్ సింగ్, టెక్నికల్ టీం డైరెక్టర్ అమితాబ్ మీ నా, ఎన్‌డీఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ సన్నీ యాదవ్, సెం ట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ పూణేకు చెందిన శాస్త్రవేత్త ఆర్. పాటిల్ తదితరులున్నారు. ఉదయం 9గంటలకు ఎల్‌అండ్‌టీ క్యాంప్ కార్యాల యానికి చేరుకున్న కమిటీ అల్పాహారం అనంతరం 9.34గంటలకు మేడిగడ్డ బ్యారేజీపైకి చేరుకుంది. బ్రిడ్జిపై నుంచి కుంగిన పియర్స్‌ను పరిశీలించిన తర్వాత అప్‌స్ట్రీమ్ వైపు బ్యారేజీ కిందికి వెళ్లారు. బ్యారేజీ ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన 19, 20, 21, 22 పియర్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పియర్స్‌లో కింది నుంచి పైవరకు భారీగా చోటుచేసుకున్న పగుళ్లను పరిశీలించారు. పియర్స్ నిర్మాణం చేసిన ఉపరితలం, లోపలివైపు పొరల గురించి తెలుసుకున్నారు. నిర్మాణ సమయంలోని బ్యారేజీ లే అవుట్, డిజైన్స్, ఫౌండేషన్, క్వాలిటీ కంట్రోల్ నివేదికలు, థర్డ్ పార్టీ మానిటరింగ్ నివేదికలు, బ్యారేజీ అప్ అండ్ డౌన్ స్ట్రీమ్స్‌లో ప్రీ అండ్ పోస్ట్ మాన్‌సూన్ తనిఖీల నివేదికలు, పియర్స్ కోసం డ్రిల్లింగ్ చేసిన బోర్‌హోల్ లాగ్ వివరాలు, ఎస్‌పీటీ, ప్లేట్ లోడ్ పరీక్షల ఫలితాల గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నట్లు సమా చారం. బ్యారేజీలో అప్‌స్ట్రీమ్ వైపు సుమారు నాలు గున్నర గంటలు తనిఖీలు నిర్వహించిన అనంతరం ఎల్‌అండ్‌టీ క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్న భోజ నం చేశారు. అనంతరం మధ్యాహ్నం 3.05 గంటల కు బ్యారేజీ డౌన్‌స్ట్రీమ్ వైపు వెళ్లారు. అక్కడ కుంగిన, పగుళ్ల, పియర్స్, రాఫ్ట్, ఆప్రాన్, సీసీ బ్లాక్స్‌ను పరిశీలించారు. బ్యారేజీలో ఏడో బ్లాక్‌లో పియర్స్ కుంగిపోవడం, భారీగా పగుళ్లు ఏర్పడటంతో ఈ మేరకు నష్టం వాటిల్లిందో అధ్యయనం చేయడానికి పియర్స్ పక్కన, అడుగున మట్టి, కాంక్రీట్‌ను తవ్వి నమూనాలు సేకరించారు. ల్యాబ్‌లో పరీక్షలు చేయనున్నట్లు సమాచారం. నిపుణుల కమిటీ వెంట ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, డీఈఈ సురేష్, ఎస్సై ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ తనిఖీలు సాయంత్ర 6 గంటల వరకు కొనసాగింది. అనంతరం నిపుణుల బృందం రామగుండం బయల్దేరింది. శుక్రవారం సుందిళ్ల బ్యారేజీని పరిశీలించనున్నట్లు సమాచారం.


ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం పర్యటన అత్యంత పగడ్బందీగా సాగింది. నిపుణుల బృందం పరీక్షలు నిర్వహించే ప్రాంతానికి నిర్మాణ సంస్థ లార్సన్ అండ్ టుబ్రో సిబ్బందిని మినహాయిస్తే బయట వారిని ఎవరినీ అనుమతించలేదు. ముఖ్యంగా మీడియాను రాకుండా పోలీసులు బ్యారేజ్‌కు రెండు వైపులా నాకాబందీ చేశారు. వంతెనపైనుంచి రాకపోకలను పూర్తిగా అడుకున్నారు. నిపుణుల బృందం పర్యటనకు సంబంధించి ఎలాంటి నిర్బంధాలు లేకపోయినా తనిఖీలు, పరీక్షల సందర్భంగా సమాచారాన్ని బయటకు పొక్కనీయకుండా ఎల్‌అండ్‌టీ సంస్థ పోలీసుల సహాయంతో గోప్యత పాటించిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

మహారాష్ట్ర వాసులకు ఇబ్బందులు

ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వచ్చిన నేపథ్యంలో బ్యారేజీ పైకి ద్విచక్ర వాహనాలను అనుమతించకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. బ్యారేజీ ప్రధాన గేట్‌ను మూసిన సెక్యూరిటీ అధికారులు మీడియాను సైతం అనుమతించలేదు. తెలంగాణ వైపు నుంచి మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు వెళ్లడానికి బైక్‌లపై వచ్చిన కూలీలు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గతంలో బైక్‌లను అనుమతించిన అధికారులు తనిఖీ ల కోసం ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ రావడంతో బైక్‌లను అనుమతించకపోవడంతో ఇక్కట్లు పడ్డారు. ముల్లెలు, మూటలను పట్టుకుని సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది.

మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

● ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు ● మార్మోగనున్న శివనామస్మరణ ● పండుగ హోరు.. వ్యాపారం జోరు



కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

వరంగల్ కల్చరల్, మార్చి 7: నగరంలోని ప్రముఖ శివాలయాలు శుక్రవారం మహాశివరాత్రి పర్వదినంను పురస్కరించుకుని ముస్తాబయ్యాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. జాగరణలు, అభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించనున్నారు. నగరంలోని శ్రీరామలింగేశ్వర, శ్రీదుర్గేశ్వర, శ్రీభోగేశ్వర, శ్రీరుద్రేశ్వర, శ్రీకాశీవిశ్వేశ్వర, కుంటి భద్రయ్య గుడి, ఆకారపు వారి గుడి, గిర్మాజిపేట శివాలయం, కరీమాబాద్ బొమ్మలగుడి, దేశాయిపేట శివాలయం, ఓసిటీ శివాలయం, రంగంపేట శివాలయం, గురుధామం శివాలయం, దత్తక్షేత్రం శివాలయం, అయ్యప్పగుడి శివాల యం, శ్రీ భద్రకాళి దేవాలయ శివాలయం, వాసవీ మాత శివాలయం, పెరుకవాడలోని శివాలయం, శివనగర్‌లోని శివాలయం, ఎస్ఆర్ఆర్ తోటలోని శివాలయం, ఉర్సులోని శివాలయం, నగర శివార్లలోని కట్టమల్లన్న కోటిలింగాల దేవాలయం, ఆరెపల్లి శివాలయం, హంటరోడ్డులోని శివాలయంతో పాటు అన్ని మండలాలు, గ్రామాల్లో నర్సంపేట, వర్ధన్నపేట డివిజన్లలో అన్ని దేవాలయాల్లో శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


● కరీమాబాద్ : రంగశాయిపేటలోని మేరవాడ భవానీ శంకరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు తెలిపారు. ఉదయం 4 గంటల నుంచే పలు పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాత్రి 6.53 గంటలకు శ్రీ భవానీశంకరుల కల్యాణ మహోత్సవం, రాత్రి 11 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలం పూజలు, అభిషేకాలు, సాంస్కృతిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

శంభునిపేట విశ్వనాథ్‌కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో కాలనీవాసుల సహకారంతో శివకల్యాణానికి అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ తెలిపారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు, కల్యాణానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

● ఖిలావరంగల్: ఖిలావరంగల్ మధ్యకోటలోని శ్రీస్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయం, శివనగర్‌లోని శ్రీసీతారామ చంద్రాలయం, శివాలయం, లేబర్‌కాలనీలోని పంచముఖ నాగవీరేశ్వరాలయం తదితర శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఉదయం 4గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు లింగోద్భవ కాలం వరకు నిర్విరామంగా గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

● 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని పంచముఖ నాగవీరేశ్వరస్వామి దేవాల యంలో గురువారం శివ పార్వతుల కల్యాణాన్ని ప్రధాన అర్చకుడు భోగేశ్వరశాస్త్రి ఘనంగా నిర్వహించారు. పారుపెల్లి రాజేందర్-సబిత దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన కార్యదర్శి మామిడాల రమేష్‌బాబు, కోశాధికారి లక్ష్మయ్య, ధర్మకర్తలు ఆరుగొండ భూదేవి, మోహన్, రాజు, నిఖితరమేష్, శ్రీలత, కిరణ్‌శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలతో కిటకిటలాడిన చౌరస్తా



మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలోని శివలింగం

వరంగల్ చౌరస్తా : మహా శివరాత్రి పండుగ సందర్భంగా గురువారం వరంగల్ చౌరస్తా ఏరియాలో వ్యాపారం జోరుగా సాగింది. నగరంలో ప్రధాన కేంద్రంగా ఉన్న వరంగల్ చౌరస్తా పరి సర ప్రాంతాల్లో వివిధ రకాల పండ్లు, పూలు, పూజా సామగ్రి, బట్టలు(నూతన వస్త్రాలు), కిరాణ సామాను అమ్మకాలతో వ్యాపారం జోరుగా సాగింది. ఏ ప్రాంతంలో ఉన్నా సరుకుల కోసం చౌరస్తాకు వచ్చి కొనుగోలు చేయాల్సిందే. దీంతో కొనుగోలుదారులతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. ప్రధానంగా కందగడ్డ కిలో రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయించారు. రోడ్లపై అరటి పండ్ల బండ్లు పెద్దఎత్తున అమ్మకాలు కొనసాగించాయి.. శివరాత్రి రోజు అభిషేకాలకు ఉపయోగించే పసుపు కుంకుమలు, డ్రైఫ్రూట్స్, గంధం విభూది, దీపం నూనె, అగరొత్తులు, దీపాలు వెలిగించే ప్రమిదలు అమ్మకాలు సాగాయి. దీంతో చౌరస్తా ప్రాంతం రద్దీగా కొనసాగింది.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 8 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

బదిలీపై వెళ్తున్న డీఎఫ్‌వోకు వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న డీఎఫ్‌వో అర్పణకు మెమొంటో అందిస్తున్న నూతన డీఎఫ్‌వో

ఖానాపురం, మార్చి 7 : జిల్లా ఫారెస్ట్ అధికారిగా ఇంతకాలం విధులు నిర్వహించిన అర్పణశ్యాల్ బదిలీపై హైదరాబాద్‌కు వెళ్తుండగా గురువారం పాకాలలో ఫారెస్ట్ అధికారులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆమెను అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ విధి నిర్వాహణలో తన అనుభూతిని అధికారులు, ఉద్యోగులతో పంచుకున్నారు. అదేవిధంగా ఏటూరునాగారం నుంచి బదిలీపై వచ్చి డీఎఫ్‌వోగా బాధ్యతలు చేపట్టిన అనుజ్ అగర్వాల్‌కు స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు. అనంతరం పాకాల బయోడైవర్సీటీ పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫ్లయింగ్‌స్వాడ్ డీఎఫ్‌వో నాగభూషణం, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, సందీప్‌రెడ్డి, వరంగల్, నర్సంపేట ఎఫ్ఆర్‌వో పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కేక్ కట్ చేస్తున్న వాసవీ పొదుపు సంఘం మహిళలు

నర్సంపేట, మార్చి 7 : మహిళలు వంటింటికే పరిమితం కాకుండా విద్యా, వ్యాపార, రాజకీయ తదితర రంగాల్లో రాణించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావా లని వాసవీ మహిళా పొదుపు సంఘం అధ్యక్షురాలు శింగిరికొండ రజని అన్నారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహు మతులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఇమ్మడి పద్మ, కార్యదర్శి చందా స్రవంతి, వజినపల్లిశారద, ఇరుకుల్ల రజిత, బండారి విజయలక్ష్మి, మాదారపు అనూష, పాలడుగుల శ్రీలత, మాదారపు పావణి. పెద్ది పద్మా వతి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినో త్సవాన్ని డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్యతిథులుగా అమ్మ ఆస్పత్రి డాక్టర్ హిమబిందు, బ్రహ్మకుమారి ఈశ్వరీ య సంఘ ప్రతినిధి వాణి, అసిస్టెంట్ మేనేజర్ భవాని, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు స్వామి, రవీందర్‌రెడ్డి, ఎస్‌డిఐ వెంకటేశ్వర్లు కార్మికులు, కండక్టర్లు, డ్రైవర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

• వర్ధన్నపేట: పీఆర్‌టీయూఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వర్ధన్నపేటలోని ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రంగయ్య మాట్లాడుతూ సంఘం పక్షాన మహిళలను సన్మానిం చడం అభినందనీయమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఆర్ టీయూఎస్ అబ్దుల్ గఫార్, సామల పట్టాభి, రాపాక సదానందం, అశోక్ కుమార్, మనుజేందర్‌రెడ్డి, బండ రమేశ్, కుమారస్వామి, విజయ, సుజాత, సాంబయ్య, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• నెక్కొండ : సృష్టిలో గొప్ప శక్తి వంతురాలు మహిళలని, మహిళలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ అష్టైశ్వర్యాలు, పాడిపంటలు అభివృద్ధి చెందు తాయని మండలంలోని పనికర ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ సత్యనారాయణ అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఉపాధ్యాయులు పి.అనిత, డి. సుకన్య, చెరకు లీలమ్మను సన్మానించారు. అలాగే నెక్కొండలోని స్నేహ ప్రగతి హై స్కూల్ లో ముందస్తు అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను జరిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.సంధ్యారాణి, మహిళ ఉపాధ్యాయులు కె.వేమలత, కె.శేష్మ, నస్రీన్ లను పాఠశాల కరస్పాండెంట్ కె.అశోక్‌కుమార్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మోహన్‌కాంత్ మాట్లాడుతూ మహిళ సంఘాలు సాధికరత దిశగా పయనించాలన్నారు. నేటీ మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా పయనించాలన్నారు. మహిళలు తీసుకున్న రుణాలను వందశాతం సకాలంలో చెల్లిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరయ్య, ఫీల్డ్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, క్యాషియర్ నవనీతచారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు హైమ, లక్ష్మి, కోఆర్డినేటర్లు, కట్టయ్య, శ్రీలత, వీవోఏలు అస్మా, శరత్, రమేష్, ఐలయ్య, బ్యాంకు సిబ్బంది సదిరం రాజు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయ చైర్మన్‌గా కృష్ణమాచార్యులు



కృష్ణమాచార్యులు



మహేందర్‌రెడ్డి

రాయపర్తి, మార్చి 7: పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన పాలకుర్తి సోమేశ్వర ఆలయ నూతన చైర్మన్‌గా మండలంలోని కొలన్‌పెల్లి గ్రామానికి చెందిన కృష్ణమాచార్యులు ఎంపికయ్యారు. అదేవిధంగా మండలంలోని మహబూబ్ నగర్ గ్రామానికి చెందిన పెండ్లి మహేందర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఎంపికైనట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఆలయ పాలకవర్గంలో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

వర్ధన్నపేట రూరల్, మార్చి 7 : మండలంలోని దివిటిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి అందరినీ అలరించారు. నాల్గో తరగతికి చెందిన ఎస్.విష్ణేష్ హెచ్‌ఎంగా, డి.సన్నిధి ఎంఈవోగా, పీఈటీగా కేశవప్రసాద్, ఉపాధ్యాయులుగా అభినాష్ ఐశ్వర్యలు వ్యవహరించారు. అనంతరం హెచ్ఎం డీ. చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన సిద్దేశ్వరాలయం

ఖానాపురం, మార్చి 7: నేడు నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు మండలంలోని ధర్మరావుపేట శివరామక్షేత్రం, బాలుతండాలోని త్రికుట శివాలయం, కొత్తూరులోని దుర్గామల్లేశ్వర ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. కాగా, ధర్మరావుపేట శివరామక్షేత్రంలో ప్రత్యేక రుద్రాభిషేకం, భక్తుల గోత్రనామాలతో అర్చన కార్యక్రమాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ నడిపెల్లి రాజేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా జడ్పీటీసీ బత్తిని స్వప్న శ్రీనివాస్‌గౌడ్ శివరామక్షేత్ర ఆలయానికి రెండు ఎల్ఈడీ లైట్లు అందజేశారు.

• చెన్నారావుపేట: మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వరాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. నేడు మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో పూజ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు, అలాగే శివపార్వతుల కల్యాణాన్ని సాయంత్రం 6 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భిక్షమయ్యశాస్త్రి, సాయిశాస్త్రి తెలిపారు. ఆలయాన్ని రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

• పర్వతగిరి : మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని పర్వతాల శివాలయం, కల్లెడలోని శివాలయం, అన్నారంలోని రామలింగేశ్వరాలయం, రోళ్లకల్లు, కొంకపాక, చింతనెక్కొండ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులకు ఏర్పాట్లను చేపట్టారు. ఎండవేడి తగలకుండా చలువపందిళ్లు, షేడ్ నెట్‌లు, తాగునీరు ఏర్పాటుచేశారు. ఆయా ఆలయాల్లో శుక్రవారం శివకల్యాణం నిర్వహించనున్నారు.

• **వేడుకలను విజయవంతం చేయాలి**

మాజీ మంత్రి ఎర్రబెల్లి

మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్‌తో కలిసి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. మండల కేంద్రంలోని పర్వతాల శివాలయంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఎర్ర బెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు మనోజ్‌గౌడ్, మాడుగుల రాజు, ఏకాంతంగౌడ్, సర్వర్, మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మోహన్‌రావు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నాటక పోటీలు



ఇంద్రప్రస్థం నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

వర్ధన్నపేట, మార్చి 7 : భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ప్రేక్షకులను విశేషంగా అలరిస్తున్నాయి. ప్రతీ రోజు రెండు నాటక ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ వారు ఇంద్రప్రస్థం నాటికను ప్రదర్శించారు. ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే కానీ.. ఆ ప్రేమలు హర్షించే విధంగా కన్పించాలే తప్పా అనాలోచితంగా వెర్రిగా పరుగెడితే జీవితం విలువలు నాశనం అయిపోతాయనే కథాంశం. గోపి సత్యప్రకాష్ రచన చేయగా, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో నాటికను రవీంద్రారెడ్డి, ప్రసాద్, సూర్య, శ్రీలేఖ, కుసుమసాయి తమ పరిధి మేరకు పాత్రలో లీనమై ఆకట్టుకున్నారు. అలాగే శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరుకు చెందిన వారు కౌసల్యా సుప్రజా రామా నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలో పురాణాలకు, సమాజానికి ఒక ధర్మం ఉంటుంది. అలాగే వేదాలకి ఓంకార నాధాలకి ఒక ధర్మం ఉంటుంది కానీ అమ్మ మనస్సుకి కూడా ఒక ధర్మం ఉంటుందని తెలుసా.. అది కని పెంచిన ధర్మం, కనిపించని ధర్మం అనేది ఈ నాటికలో వివరించారు. ఆకెళ్ల శివప్రసాద్ మూల కథను అందించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. పి.వినయ్, సురభి ప్రభావతి, గోపరాజు విజయ్ నాటికలో పాత్రలను పోషించి విశేషంగా ఆకట్టుకున్నారు.

పురుషుల పొదుపు సమితి కమిటీ ఎంపిక



రత్నాకర్‌రెడ్డి



మోహన్‌రావు

దుగ్గొండి, మార్చి 7 : మండలంలోని గిర్ని బావిలో ఆదర్శ పురుషుల పొదుపు సమితి 27వ వార్షిక మహాసభ అధ్యక్షుడు చీకటి కృష్ణనిరంజన్ అధ్యక్షతన, సహవికాస సంస్థ మేనేజర్ లక్ష్మణ్, ధర్మకర్త కనుగుల ధర్మవతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహ వికాస సంస్థ మేనేజర్ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పడిన పొదుపు సంఘాలతో ఆర్థికంగా కుటుంబాలు బలోపేతం చెందుతున్నాయన్నారు. 12గ్రామాల్లో ఏర్పడిన పొదుపు సంఘాలతో సమితిగా ఆవిర్భవించి సంఘాలకుఅండగా నిలుస్తాయన్నారు. అనంతరం సమితి పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా చాపల బంద పొదుపు సంఘం అధ్యక్షుడు తోకల రత్నాకర్ రెడ్డి, ఉపాధ్య క్షుడిగా పొనకల్ పొదుపు సంఘం అధ్యక్షుడు లడె మోహన్‌రావు, డైరెక్టర్లుగా వీరంటి రమేశ్ (మందపల్లి), యార మహేందర్‌రెడ్డి(తొగర్రాయి), నంగునూరి సాంబయ్య(నాచినపల్లి), చీకటి కృష్ణనీరంజన్ (పల్లాగూడ), అనుమాండ్ల ఈశ్వర్‌రెడ్డి (తిమ్మం పేట),దేవులపల్లి రాజు (మొంద్రాయి), మామిడా ల ప్రవీణ్ (నల్లబెల్లి), అనువుల సురేశ్ (గిర్ని బావి), పోశాలు (బిక్కాజిపల్లి), రంగచారి (కుంట పల్లి)లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సహవికాస డీవో రాజశ్రీ, వివిధ గ్రామాల పొదుపు సంఘాల బాధ్యులు, డైరెక్టర్లు హాజరయ్యారు.

మెరుగైన విద్యను అందించేవి ప్రభుత్వ పాఠశాలలే..



దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంఈవో

నెక్కొండ, మార్చి 7 : ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాశాఖాధికారి వి.రత్నమాల అన్నారు. గురువారం నెక్కొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా టీ షర్ట్స్‌ను ఆమె పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో విధులను నిర్వహిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జుత్తి కిరణ్‌ప్రసాద్-రజిత దంపతుల ఆర్థిక సహాయంతో పాఠశాలలోని 75 మంది విద్యార్థులకు టీషర్ట్స్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం మంది నిరుపేదలు ఉంటారని, వారికి ఆర్థిక సహాయం అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవో అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ జాన్‌నాయక్, ఉపాధ్యాయులు ఐలయ్య, భారతి, గంగాధర్, వెంకటరమణ, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

• **తహసీల్దార్‌కు మలిదశ ఉద్యమకారుల వినతి**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యమకారులు

నల్లబెల్లి, మార్చి 7 : ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మలి దశ తెలంగాణ ఉద్యమకారులు గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బొనగాని రాజేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు ఆకుల సాంబారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 250 చదరపు గజాల ఇందిరమ్మ ఇండ్లను ఉద్యమకారులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బొట్ల పవన్, వేముల రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ

చెన్నారావుపేట, మార్చి 7 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరెండెంట్ దయాకర్ మాట్లాడుతూ గ్రామాల్లోని నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న గ్యారెంటీ పథకాలు చేరనట్లయితే కార్యాలయానికి సంబంధిత లబ్ధిదారుడు చేరుకొని తమ దరఖాస్తులను అందించాలన్నారు. ఉచిత విద్యుత్ పథకం, గ్యాస్ సబ్సిడీ తదితర పథకాలకు అర్హులైన వారి వివరాలను కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టైపిస్టు రజిత, సారంగం తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సాంస్కృతిక రంగంలో రాణించాలి

దుగ్గొండి, మార్చి 7 : చదువుతో పాటు విద్యార్థులు సాంస్కృతిక రంగంలో రాణించాలని సంక్షేమ గురుకులాల రీజినల్ కో-ఆర్డినేటర్ వై. మనోహర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే విద్యాలయం 5వ వార్షిక దినోత్సవం గురువారం నిర్వహించగా ముఖ్య అతిథిగా మనోహర్ రెడ్డి మాట్లాడారు. రాబోయే పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన ప్రమాణాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. గత ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు ఆచార్య రవికుమార్, ప్రిన్సిపాల్ కురోజు దేవేందర్, బైరెడ్డి రజేందర్‌రెడ్డి, శిరీష, సోమరాణి. సునీత, సురేశ్, బషీర్, వీరేందర్, కిరణ్, ప్రభాకర్, సుకుమార్, సతీష్, అనిత, ప్రేమలత పాల్గొన్నారు.

గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందించాలి

చెన్నారావుపేట, మార్చి 7 : మండలంలోని అన్నీ గ్రామాలకు రానున్న వేసవి కాలంలో మిషన్ భగీరథ తాగునీటిని అందించాలని ఎంపీడీవో గోవిందరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు. ఫీల్డ్ అసిస్టెంట్లతో వేసవి కాలంలో చేపట్టవల్సిన అంశాలపై సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వన నర్సరీలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చెత్తా, చెదారం లేకుండా పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. రానున్న వేసవి కాలంలో గ్రామాల కార్యదర్శులు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్ రాజు, ఏపీవో అరుణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బాండ్ల అందజేత

పర్వతగిరి, మార్చి 7 : పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గోపనపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బాండ్లను అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రతీ పీఆర్‌టీయూ సభ్యుడు వెల్ఫేర్ సభ్యత్వం తప్పనిసరిగా పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్యా రాములు, ప్రధాన కార్యదర్శి వుగ్గె రమేష్, పాఠశాల హెచ్ఎం జె.లింగమూర్తి, ఉపాధ్యాయులు మహ్మద్ ఫరీద్, ప్రణయ్ కుమార్, పూర్ణచందర్, రమేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అణువణువూ పరిశీలన

భూపాలపల్లి/కాటారం/మహదేపూర్, మార్చి 7 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) గురువారం సందర్శించింది. నీటిపారుదల శాఖ అధికారులు, బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్‌ఎన్‌టీ సిబ్బంది మినహా ఎవరినీ అనుమతించలేదు. సుమారు ఏడుగంటలపాటు బ్యారేజీని అణువణువూ పరిశీలించిన బృందం అనేక కోణాల్లో వివరాలు సేకరించింది.కాళేశ్వరం ప్రాజెక్టులో గుండెలాంటి మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు లేఖరాసింది. దీంతో నిపుణుల బృందం గురువారం మేడిగడ్డలో పర్యటించి.. పియర్స్ కుంగిపోవడం, బీటలువారడం తదితర అంశాలను నిశితంగా పరిశీలించింది. ఏడో బ్లాక్‌లోని ప్రతీ పియర్ వద్ద క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఆ బృందం మొత్తం 19అంశాలను పరిశీలించి కీలక సమాచారాన్ని సేకరించిందని తెలుస్తోంది. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీలో న్యూఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ యు.సి.విద్యార్థి, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) డైరెక్టర్ శివకుమార్ శర్మ, డ్యాం గేట్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ రెజిలియన్స్ డైరెక్టర్ రాహుల్ కుమార్ సింగ్, టెక్నికల్ టీం డైరెక్టర్ అమితాబ్ మీనా, ఎన్‌డీఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ సన్నీ యాదవ్, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ పూణేకు చెందిన శాస్త్రవేత్త ఆర్. పాటిల్ తదితరులున్నారు. ఉదయం 9 గంటలకు ఎల్‌అండ్‌టీ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న కమిటీ అల్పాహారం అనంతరం 9.34గంటలకు మేడిగడ్డ బ్యారేజీపైకి చేరుకుంది. బ్రిడ్జిపై నుంచి కుంగిన పియర్స్‌ను పరిశీలించిన తర్వాత అప్‌స్ట్రీమ్ వైపు బ్యారేజీ కిందికి వెళ్లారు. బ్యారేజీ ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన 19, 20, 21, 22 పియర్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పియర్స్‌లో కింది నుంచి పైవరకు భారీగా చోటుచేసుకున్న పగుళ్లను పరిశీలించారు. పియర్స్ నిర్మాణంచేసిన ఉపరితలం, లోపలివైపు పొరల గురించి తెలుసుకున్నారు. నిర్మాణ సమయంలోని బ్యారేజీ లే అవుట్, డిజైన్స్, ఫౌండేషన్, క్వాలిటీ కంట్రోల్ నివేదికలు, థర్డ్ పార్టీ మానిటరింగ్ నివేదికలు, బ్యారేజీ అప్ అండ్ డౌన్ స్ట్రీమ్స్‌లో ప్రీ అండ్ పోస్ట్ మాన్‌సూన్ తనిఖీల నివేదికలు, పియర్స్ కోసం డ్రిల్లింగ్ చేసిన బోర్‌హోల్‌లాగ్ వివరాలు, ఎస్‌పీటీ, ప్లేట్ లోడ్ పరీక్షల ఫలితాల గురించి ఇరిగేషన్ అధికా రులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. బ్యారేజీలో అప్‌స్ట్రీమ్ వైపు సుమారు నాలుగున్నర గంటలు తనిఖీలు నిర్వహించిన అనంతరంఎల్‌అండ్‌టీ క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్న భోజనంచేశారు. అనంతరం మధ్యాహ్నం 3.05గంటలకు బ్యారేజీ డౌన్‌స్ట్రీమ్ వైపు వెళ్లారు. అక్కడ కుంగిన, పగుళ్లు, పియర్స్ రాఫ్ట్, ఆప్రాన్, సీసీ బ్లాక్స్‌ను పరిశీలించారు. బ్యారేజీలో ఏడో బ్లాక్‌లో పియర్స్ కుంగిపోవడం, భారీగా పగుళ్లు ఏర్పడటంతో ఈ మేరకు నష్టం వాటిల్లిందో అధ్యయనం చేయడానికి పియర్స్ పక్కన, అడుగున మట్టి, కాంక్రీట్‌ను తవ్వి నమూనాలు సేకరించారు. ల్యాబ్‌లో పరీక్షలు చేయనున్నట్లు సమాచారం. నిపుణుల కమిటీ వెంట ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, డీఈఈ సురేష్, ఎస్సై ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ తనిఖీలు సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. అనంతరం నిపుణుల బృందం రామగుండం బయల్దేరింది. శుక్రవారం సుందిళ్ల బ్యారేజీని పరిశీలించనున్నట్లు సమాచారం.

ఎల్‌అండ్‌టీ కనుసన్నల్లోనే...

ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం పర్యటన అత్యంత పగడ్బందీగా సాగింది. నిపుణుల బృందం పరీక్షలు నిర్వహించే ప్రాంతానికి నిర్మాణ సంస్థ లార్సన్ అండ్ టుబ్రో సిబ్బందిని మినహాయిస్తే బయట వారిని ఎవరినీ అనుమతించలేదు. ముఖ్యంగా మీడియాను రాకుండా పోలీసులు బ్యారేజ్‌కు రెండు వైపులా నాకాబందీ చేశారు. వంతెనపైనుంచి రాకపోకలను పూర్తిగా అడ్డుకున్నారు. నిపుణుల బృందం పర్యటనకు సంబంధించి ఎలాంటి నిర్బంధాలు లేకపోయినా తనిఖీలు, పరీక్షల సందర్భంగా సమాచారాన్ని బయటకు పొక్కనీయకుండా ఎల్‌అండ్‌టీ సంస్థ పోలీసుల సహాయంతో గోప్యత పాటించిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

మహారాష్ట్ర వాసులకు ఇబ్బందులు

ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వచ్చిన నేపథ్యంలో బ్యారేజీ పైకి ద్విచక్ర వాహనాలను అనుమతించకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. బ్యారేజీ ప్రధాన గేట్‌ను మూసిన సెక్యూరిటీ అధికారులు మీడియాను సైతం అనుమతించలేదు. తెలంగాణ వైపు నుంచి మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు వెళ్లడానికి బైక్‌లపై వచ్చిన కూలీలు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గతంలో బైక్‌లను అనుమతించిన అధికారులు తనిఖీల కోసం ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ రావడంతో బైక్‌లను అనుమతించకపోవడంతో ఇక్కట్లు పడ్డారు. ముల్లెలు, మూటలను పట్టుకుని సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది.

ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ నిరసన



బ్యాంక్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వర్ధన్నపేట, మార్చి 7 : ఎలక్టోరల్ బాండ్ పథకంపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ ద్వారా సేకరించిన విరాళాల పూర్తి వివరాలను రాజకీయ పార్టీలు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాన్ని సమర్థిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎస్‌బీఐ బ్యాంకుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.2017లో పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి రాజకీయ పార్టీలు సమష్టిగా రూ. 1200 కోట్లకు పైగా అందుకోగా, బీజేపీ ఒకటే రూ.26,500 కోట్లకు పైచిలుకు ఎలక్టోరల్ బాండ్ ద్వారా స్వీకరించినట్లు నేతలు అభిప్రాయపడ్డారు. సుప్రీం కోర్టు ఆదేశాలను గౌరవించని ఎస్‌బీఐ బ్యాంకుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ పథకం ప్రాథమిక అధికారిగా ఉన్నా సుప్రీం కోర్టు ఆదేశాలను పెడచెవిన పెట్టడం సమర్థనీయం కాదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిదురాల కుమారస్వామి, కౌన్సిలర్లు సమ్మెట సుధీర్‌గౌడ్, తుమ్మల రవీందర్, భూక్య సరిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అఫ్సర్, యాదగిరి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో యువతకు ప్రాధాన్యత

నర్సంపేట, మార్చి 7 : బీజేపీలో యువతకు పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యత కలిపిస్తుందని బీజేపీ నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ ఇన్‌చార్జి గోగుల రాణాప్రతాప్ రెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం మండలంలోని రాజుపేటకు చెందిన 10మంది యువకులు బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను మారుమూల గ్రామాల ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్రమోదీ గెలుపునకు కృషిచేసి మళ్లీ దేశ ప్రధాని కావడానికి కార్యకర్తలు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపెల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, బాల్నె జగన్, పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు. దుగ్గొండి మండల కమిటీ అధ్యక్షుడు నెదురు రాజేందర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

• నల్లబెల్లి : పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ నర్సంపేట నియోజకవర్గ నాయకుడు గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పలువురు బీజేపీలో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో బీజేపీ సీట్లు పెరిగేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, తడుక అశోక్, తడుక వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికార ప్రతినిధి శేఖర్‌రావుకు సన్మానం



నిమ్మానిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, మార్చి 7 : వర్ధన్నపేట నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన ప్రముఖ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావును కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తుమ్మల శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్ల వెంకన్న, న్యాయవాది జన్ను ప్రభాకర్, ఆటో యూనియన్ నాయకులు తుమ్మల సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి



నెక్కొండ, మార్చి 7 : నెక్కొండ మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డిని నియమించినట్లు దేవాదాయశాఖ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా బెజ్జంకి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా గుంటుపల్లి ప్రభాకర్‌రావు, కొత్తకొండ గణేష్, రాపాక అనిల్, కొంగర హైమావతి, సోమ సతీష్‌రెడ్డి, దేవనబోయిన వీరస్వామి, కక్కెర్ల శ్రీనివాస్, కోల్కనూరి యాకలక్ష్మి లను నియమించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కమిటీని నియమించారు. ఈ నియామకం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేశారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

రాయపర్తి, మార్చి 7: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాలోతు సారయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, పదో తరగతి విద్యార్థుల ప్రస్తుత చదువుపై ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ సబ్జెక్టు వారీగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గారె కృష్ణమూర్తి, ఇన్‌చార్జి హెచ్ఎం సతీష్, ఏబీఆర్ చార్యులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, యాకయ్య పాల్గొన్నారు.

శివాలయంలో బరువు లాగడం పోటీలు

పర్వతగిరి, మార్చి 7 : మండల కేంద్రంలోని పర్వతాల శివాలయం ఆవరణలో గురువారం బరువు లాగడం పోటీలను ఘనంగా నిర్వహించారు. పోటీలలో పలు గ్రామాల నుంచి 20జట్లు పాల్గొనగా, ప్రథమ బహుమతి కల్లెడ గ్రామ శివారు లోని నర్సైంగతండా రూ.40వేలు, ద్వితీయ బహుమతి నెక్కొండ మండలంలోని పిట్టకాల తండా రూ. 30వేలు, మూడవ బహుమతి కల్లెడ రూ.20వేలు, నాలుగవ బహుమతి నెక్కొండ మండలంలోని వెంకటాపురం జట్లు రూ.10వేలు గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు ఏఎస్సై రవీందర్‌రెడ్డి, నిర్వాహకులు సంపెల్లి వెంకటేశ్వర్‌రావు, జనార్ధన్, దయాకర్ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అశోక్, భాస్కర్, శేఖర్ పాల్గొన్నారు.